క్లుప్తంగా

హైదరాబాద్‌కు బస్సు సేవలు

సంగాయిపల్లి నుంచి ప్రారంభమైన రవాణా సౌకర్యం



బస్సును ప్రారంభిస్తున్న గ్రామస్తులు

దుద్యాల్: మండల పరిధిలోని సంగాయిపల్లికి ఆర్టీసీ బస్సు సర్వీసు సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేకంగా బస్సుకు పూజలు చేసి జెండా ఊపారు. గ్రామ మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాలకు సైతం బస్సు సేవలు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. బస్సు మొదటగా తాండూరు డిపో నుంచి ప్రారంభమై సంగాయిపల్లితండా మీదుగా సంగాయిపల్లి గ్రామానికి చేరుకుంటుంది. అక్కడి నుంచి కుదురుమల్ల, ఆలేడ్, దుద్యాల్ గేట్ మీదుగా కోస్గికి చేరుకుని అటునుంచి నేరుగా హైదరాబాద్ వెళుతుందని చెప్పారు. ఈ సేవలు నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో అందుబాటులో ఉండనున్నట్లు వివరించారు.

భక్తిభావంతో మానసిక ప్రశాంతత



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న భాస్కరయోగి

కుల్కచర్ల: ప్రతిఒక్కరికి భక్తిభావంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త భాస్కరయోగి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని పీరంపల్లిలో భక్తాంజనేయ స్వామి భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలో పాల్గొని ఆయన ప్రసంగించారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ప్రజలందరూ హిందుత్వ భావాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గొల్ల సత్యనారయణ, సత్యనారాయణరెడ్డి, పోలెపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని పూజలు



మోత్కూర్ శివాలయం వద్ద భక్తులు

దోమ: వర్షాలు కురవాలని కోరుతూ కేఎస్‌ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ సోమవారం స్థానికులతో కలిసి పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శివుడు, ఆంజనేయుడు, మైసమ్మ, పోచమ్మ ఆలయాలను సందర్శించుకుని, కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కరణం శ్రీకాంత్‌రావు, బీజేపీ నాయకుడు వార్ల అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

చేనేత సంఘం కమిటీ ఎన్నిక

దౌల్తాబాద్: చేనేత సంఘం మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో నీలకంఠ స్వామి దేవాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మండల గౌరవ అధ్యక్షుడిగా శివశంకర్, అధ్యక్షుడిగా మంత అంజయ్య, ఉపాధ్యక్షుడిగా స్వామి, కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా పుల్లప్ప, లక్ష్మణ్, వెంకటప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు అంజయ్య మాట్లాడుతూ.. చేనేత కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో చేనేత సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాధికారి

పరిగి: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలను తప్పక పాటించాలని మండల విద్యాధికారి గోపాల్ సూచించారు. సోమవారం పట్టణ కేంద్రంలో పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎన్ని తరగతుల వరకు అనుమతులు ఉంటే అంత వరకే అడ్మిషన్‌లు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రాంగణంలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు విక్రయించరాదని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



హస్నాబాద్ రైతు వేదిక వద్ద పిచ్చిమొక్కలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



దుద్యాల్‌లో ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఇలా..

అల్లుకున్న ప్రమాదం

- విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ముప్పు
- పిచ్చి మొక్కలతో నిండుకున్న ట్రాన్స్‌ఫార్మర్లు
- పట్టించుకోని అధికారులు

దుద్యాల్: వర్షాకాలం ప్రారంభంలో విద్యుత్ తీగలకు తగిలే చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమం అధికారులు చేపడుతారు. కానీ దుద్యాల్ మండలంలో అరకొర పనులతో విద్యుత్ సరఫరాలో అంతరాయం తరచూ ఏర్పడుతున్నాయి. నిత్యం ఏదో ఓ చోట ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగి దానికి అల్లుకుంటున్నాయి. మండల పరిధిలోని చెట్టుపల్లి తండా, సాగారం తండా, హస్నాబాద్ తదితర గ్రామాల్లో ఈ సమస్య అధికంగా దర్శనమిస్తోంది. హస్నాబాద్‌లోని రైతు వేదికకు ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు పేరుకుపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

భయాందోళనలో విద్యార్థులు

దుద్యాల్ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం పక్కనే ప్రధాన విద్యుత్ తీగలకు పిచ్చి మొక్కలు వేలాడుతూ ప్రమాదానికి సంకేతాలు చూపుతున్నాయి. అదే ఊరిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు హైటెన్షన్ విద్యుత్ లైన్లు ఉండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఏకంగా రెండు విద్యుత్ లైన్‌లు బడి మీదుగా వెళ్లడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటున్నారు. సెలవు రోజుల్లో గ్రామానికి చెందిన యువకులు ఈ ఆవరణలో ఆటలు ఆడుకుంటారు. విద్యుత్ అధికారులకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో ఉన్న విద్యుత్ తీగలను మార్చాలని కోరుతున్నారు. అలాగే మండల పరిధిలో సైతం విద్యుత్ తీగలకు తగిలే చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు



కొడంగల్ రూరల్: లబ్ధిదారునికి ప్రొసీడింగ్‌ను అందిస్తున్న నాయకులు



దుద్యాల్: కుదురుమల్లలో ఇళ్ల మంజూరు పత్రాలతో లబ్ధిదారులు

కొడంగల్ రూరల్: అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంతు అన్నారు. సోమవారం పట్టణంలోని బాలాజీనగర్‌లో లబ్ధిదారుల ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో జాప్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండల పరిధిలోని పర్సాపూర్, చిట్లపల్లి, పాటిమీదిపల్లి తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

దుద్యాల్: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ దుద్యాల్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ అన్నారు. సోమవారం కుదురుమల్లలో 43 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి కోసం నిధుల మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం గ్రామానికి చెందిన దోరేపల్లి నర్సయ్యగౌడ్‌కు సీఎం ఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.50 వేల ఎల్‌ఓసీని అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కిష్టంపల్లిలో..

కుల్కచర్ల: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను అందుతాయని పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ, కాంగ్రెస్‌పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్ అన్నారు. కిష్టంపల్లి, బంగ్రంపల్లి గ్రామాలలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను అందజేసి పనులను ప్రారంభించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సబ్ యూనిట్ అధికారి పకీరప్ప

కొడంగల్ రూరల్: వర్షాకాలం ప్రారంభమవ్వడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, దీనికి సంబంధిత శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, కొడంగల్ సబ్ యూనిట్ అధికారి ఎస్.పకీరప్ప సూచించారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకొని మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య సహాయకులు, ఆశ కార్యకర్తలకు పలు సూచనలు అందించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు తదితర సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని, ఫీవర్ సర్వే, యాంటీ లార్వల్ ఆపరేషన్, లార్వల్ ఫాగింగ్ మొదలగు కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు అమృత, నికిత, సూపర్‌వైజర్లు సుశీల, ఏఎన్‌ఎంలు చంద్రకళ, మణెమ్మ, మధుసూదన్‌రెడ్డి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్



మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) అలుపెరగని పోరాటం చేస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. కేరళలో ఈ నెల 27 నుంచి 30 వరకు నిర్వహించనున్న ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ మహాసభల వాల్‌పోస్టర్‌ను పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థుల హక్కులు, సామాజిక న్యాయం, ప్రగతిశీల విద్యావిధానాల కోసం ఎస్‌ఎఫ్‌ఐ గత 50 ఏళ్లుగా పోరాడుతోందన్నారు. విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని, అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలన్నారు. కుల, మత, ఆర్థిక, వివక్షతను రూపుమాపడానికి విద్యార్థి ఉద్యమాలు ఒక వేదికగా ఉపయోగపడతాయని వివరించారు. సామ్రాజ్యవాదం, దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడే అంతర్జాతీయ విద్యార్థి ఉద్యమంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భవించిందన్నారు. సోషలిస్ట్ ఆలోచనల నుంచి ప్రేరణ పొంది, దోపిడీ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సుమయిర్, కార్యదర్శి శివశంకర్, నాయకులు ఆదిల్, మహ్మద్‌హాజీ, నితిన్‌కుమార్, రాకేశ్, సిద్ధు, జాఫర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

నందిగామ: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నందిగామ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు.. జీవితం ముద్దు.. అనే అంశంపై మత్తు పదార్థాలతో జరిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌స్పెక్టర్ హాజరై మాట్లాడుతూ.. ఒక క్షణం మత్తు జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. విద్యార్థులు, యువత ఎట్టి పరిస్థితుల్లో మత్తుకు బానిసలుగా మారొద్దని సూచించారు. మత్తు అనేది జీవితాన్ని నాశనం చేయడంతో పాటు కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

కొత్తూరులో..

కొత్తూరు: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ నర్సింహారావు సూచించారు. పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి సీఐ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

నేడు స్పీకర్ పర్యటన

మోమిన్‌పేట: మండల పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు మంగళవారం రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. కేసారంలో నూతన సబ్‌స్టేషన్ శంకుస్థాపన, మోమిన్‌పేటలో డీసీసీబీ బ్యాంకు నూతన భవనం ప్రారంభోత్సవంలో స్పీకర్ పాల్గొంటారని పేర్కొన్నారు.

కొనసాగుతున్న పీఎస్ నిర్మాణ పనులు

దుద్యాల్: దుద్యాల్ పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మండల కేంద్రానికి మూడు కిలో మీటర్ల దూరంలో 2.18 ఎకరాల విస్తీర్ణంలో స్టేషన్ నిర్మిస్తున్నారు. గత నెలలో పోలీస్ ఉన్నతాధికారులు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. మహబూబ్‌నగర్-చించోలి ప్రధాన రహదారి పక్కన నిర్మిస్తే ప్రమాదాలకు అనుకూలంగా ఉండే అవకాశం ఉందనే ఆలోచనతో ఇక్కడ నిర్మిస్తున్నట్లు సమాచారం.

ఉపాధ్యాయులకు తనిఖీల భారం వద్దు

యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గోపాల్

బొంరాస్‌పేట: పాఠశాలల తనిఖీని ఉపాధ్యాయులకు ఇవ్వడం సరికాదని, వెంటనే ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గౌరారం గోపాల్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. పాఠశాలల్లో ప్రస్తుతం ఉపాధ్యాయుల కొరత ఉండగా, వారికి తనిఖీల పేరుతో భారం మోపొద్దన్నారు. గజిటెడ్ హోదాలో ఉన్న జీహెచ్‌ఎం, ఎంఈఓలను సైతం స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు తనిఖీ చేయడం సమంజసం కాదన్నారు. విద్యాశాఖ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎంపీ డీకే అరుణ

షాద్‌నగర్: మండల పరిధిలోని కమ్మదనంలో సోమవారం పలువురు నాయకులు ఎంపీ డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు వెంకటయ్య, కృష్ణ, జాకారం కృష్ణ, కిష్టయ్య తదితరులు పార్టీలో చేరగా.. ఎంపీ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, దేపల్లి అశోక్‌గౌడ్, మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ బోనాలకు ఆహ్వానం

షాబాద్: ఈ నెల 26వ తేదీన నిర్వహించే గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాలకు హాజరుకావాలని సోమవారం కుమ్మరి వంశీకులు ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కుమ్మరి వంశీకులు కుమ్మరి చెన్నయ్య, శంకర్, శ్రీనివాస్, మల్లేశ్, కుమార్, దర్శన్, గిరి, హనుమంతరావు, పాండు పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు

షాబాద్: జీవాలకు సీజనల్ వ్యాధులు రాకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని లక్ష్మరావుగూడలో జీవాలకు చిటుక వ్యాధి నివారణకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది బాల్‌రాజ్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, రైతులు, తదితరులు ఉన్నారు.

జాతీయ భావాలు అలవర్చుకోవాలి

పరిగి: మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్ గ్రామంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి(బలిదాన్ దివస్) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు అనసూయ మాట్లాడుతూ.. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ఆయన దేశానికి ఎన్నో రకాలు సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

కుల్కచర్ల: జాతీయ ఐక్యత, దేశ ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేసిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ నేటి యువతకు ఆదర్శప్రాయుడని కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఘణపురం వెంకటయ్య, బీజేపీ మహిళా మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యారెడ్డి, దిశ జిల్లా కమిటీ సభ్యుడు జానకిరాం చౌహాన్ పేర్కొన్నారు. సోమవారం శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ పురస్కరించుకుని మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతిఒక్కరూ జాతీయ భావాలను పెంపొందించుకోవాలని, దేశ సమగ్రత కోసం ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మైపాల్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్యముదిరాజ్, కేజీబీవీ ప్రత్యేకాధికారి జ్యోతి, నాయకులు మహేష్, ప్రవీణ్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: కేజీబీవీలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న బీజేపీ నేతలు

బీజేపీ నాయకుల శ్రద్ధాంజలి

బొంరాస్‌పేట: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. దేశభక్తుడు, జమ్ముకశ్మీర్‌ను భారతదేశంలో విలీనంగా ఉండేలా పోరాడిన నేతను స్మరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బాబాయ్యనాయుడు, నాగురావు, జగదీశ్వర్, శ్రావణ్‌గౌడ్ ఉన్నారు.

ఎమ్మార్పీఎస్‌తోనే వర్గీకరణ సాధ్యమైంది



హాజీపూర్ గ్రామ కమిటీతో ఎమ్మార్పీఎస్ నాయకులు

సంస్థ మండల ఇన్‌చార్జి సూర్యప్రకాష్

యాలాల: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఎమ్మార్పీఎస్‌తో సాధ్యమైందని యాలాల మండల ఇన్‌చార్జి మెట్లి సూర్యప్రకాష్ అన్నారు. సోమవారం మండలంలోని హాజీపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి మంద కృష్ణ మాదిగ ఊపిరి పోశారన్నారు. హాజీపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మల్లేశం, అధికార ప్రతినిధిగా రాజు, ఉపాధ్యక్షులుగా మల్లేశం, కిష్టాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులుగా పల్లె గోపాల్, అధికార ప్రతినిధిగా మల్లేశ్, ఉపాధ్యక్షులుగా జోగు శ్రీనివాస్, పెండల శ్రీనివాస్, నరేందర్ తదితరులను ఎన్నుకున్నారు.

వందశాతం సబ్సిడీతో విత్తనాలు

ఏడీఏ శంకర్‌రాథోడ్



సబ్సిడీ విత్తనాలను రైతులకు అందిస్తున్న వ్యవసాయాధికారులు

కొడంగల్ రూరల్: జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో భాగంగా మండలంలోని రైతులకు వంద శాతం సబ్సిడీతో విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు ఏడీఏ శంకర్‌రాథోడ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలో కొడంగల్ మండలంలోని పలువురు రైతులకు సబ్సిడీ విత్తనాలను అందించారు. 460 కంది విత్తనాల కిట్లు, 40 రాగి విత్తన కిట్లు రైతులకు ఉచితంగా అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. విత్తన కిట్లు పొందాలనుకునే మండల రైతులు తమ స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ)ను సంప్రదించాలని సూచించారు. తప్పనిసరిగా ఆధార్‌కార్డు, పట్టాదార్ పాస్ బుక్ జిరాక్స్‌లను తీసుకొనిరావాలని, తమ మొబైల్ నంబర్‌ను తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏఓ తులసి, ఏఈఓలు ఇస్సాక్ హెరాల్డ్, శ్రీపతిరెడ్డి, దేవేందర్, అశ్విని, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వ్యసనాలతో భవిష్యత్తు నాశనం

ఎస్‌ఐ అరుణ్ కుమార్



మాట్లాడుతున్న ఎస్‌ఐ అరుణ్‌కుమార్

నవాబుపేట: విద్యార్థులు చెడు వ్యసనాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని నవాబుపేట ఎస్‌ఐ అరుణ్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం డ్రగ్స్ వినియోగంపై కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చక్కగా చదువుకునే వయసులో విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి బంగారం లాంటి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. డ్రగ్స్, గంజాయి, సిగరెట్, మద్యపానం తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కంది విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఏఈఓ శ్రీకాంత్

తాండూరు రూరల్: మండలంలోని రైతులకు ఉచితంగా కంది విత్తనాలను పంపిణీ చేశారు. సోమవారం తాండూరు వ్యవసాయ కార్యాలయంలో నారాయణపూర్ ఏఈఓ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వీర్‌శెట్టిపల్లి గ్రామ రైతులకు విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ.. ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం కింద నాలుగు కిలోల మిని కిట్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. కంది విత్తనాలు కచ్చితంగా విత్తుకోవాలని, వాటికి జియో ట్యాగింగ్ చేశామన్నారు. కార్యక్రమంలో వీర్‌శెట్టిపల్లి పంచాయతీ కార్యదర్శి నసీర్, నాయకుడు జర్నప్ప, రైతులు పాల్గొన్నారు.

విడతల వారీగా అభివృద్ధి పనులు



తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ లావణ్య, నాయకులు

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: నిధుల లభ్యతను బట్టి విడతల వారీగా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆమె పలువురు నాయకులతో కలిసి 1వ వార్డులో తాగునీటి పైపులైను పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో దాదాపుగా సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేసినట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం పలు వార్డుల్లో పనులు కొనసాగుతున్నాయని వివరించారు. అభివృద్ధి పనులకు ప్రజలు, వ్యాపారులు తమవంతుగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు మాధవి, సోమ్లానాయక్, నాయ కులు దేవేందర్‌యాదవ్, గోపాల్‌గౌడ్, రామకృష్ణ, శ్రీశైలం, నందు, శ్రీను, యాదయ్య, కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని షాబాద్ ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సింహాద్రినాయుడు, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, అంజయ్య, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.